ప్రజాశక్తి

గురువారం 3 ఏప్రిల్ 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



గుంటూరు, కృష్ణాజిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలపాటి

రాజేంద్రప్రసాద్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ బుధవారం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. మోషన్ రాజు ఆయన చేత ప్రమాణం చేయించారు. అనంతరం మండలి నియమ నిబంధనలకు సంబంధించిన పలు డాక్యుమెంట్స్, ఇతర వివరాలను రాజేంద్రప్రసాద్‌కు మోషన్ రాజు అందచేశారు. రాజేంద్ర ప్రసాద్‌కు వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, యార్లగడ్డ వెంకటరావు, కిట్స్ కళాశాల అధినేత సుబ్బారావు, పలువురు విద్యా సంస్థల నిర్వాహకులు, టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



ఉన్నత విద్యనందించేందుకే పాఠశాలల విలీనం : కలెక్టర్

7లో

ధాన్యం సేకరణ నిలిపివేత



- కృష్ణాజిల్లాలో రైతుల వద్ద రెండు టన్నులు నిల్వ
- బస్తా రూ.1600కు మిల్లర్లు కొనుగోలు
- రూ.140 కోతతో అన్నదాతల్లో ఆందోళన
- దాళ్వా ధాన్యం సేకరణపైనా స్పష్టత కరువు



ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలు నీటిమూటలయ్యాయి. ఖరీఫ్‌లో పండిన ధాన్యం పూర్తి స్థాయిలో రైతులు విక్రయించకముందే ధాన్యం సేకరణను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకోవడం కోసం రైతులు అవస్థలు పడాల్సి వస్తోంది. రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కె)ల ద్వారా విక్రయించే అవకాశం లేకపోవడంతో మిల్లర్లు అడిగిన ధరకే రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 75 కిలోల ఏ గ్రేడ్ ధాన్యానికి ప్రభుత్వం రూ.1740 కనీస మద్దతు ధర నిర్ణయించగా 1600కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు 33 నుంచి 35 బస్తాల ధాన్యం దిగుబడి వస్తోంది. ఒక్కో బస్తాకు మిల్లర్లు రూ.140 చొప్పున కోత పెట్టడంతో ఎకరాకు 4,620 నుంచి 4,900 వరకు నష్టపోవాల్సి వస్తోంది. మరోపక్క దాళ్వా ధాన్యం సేకరణపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

కుప్పల్లో రెండు లక్షల టన్నులు

ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామానికి చెందిన మల్లిపెద్ది సాంబశివరావు 2.70 ఎకరాల్లో ఎంటియు 1061 వరి సాగు చేశారు. రబీ అపరాలు నూర్పిడి పూర్తయిన తర్వాత కిరాయి ట్రాక్టరు మాట్లాడుకుని కుప్పనూర్చడానికి ఆలస్యమైంది. నూర్చిన (మిగతా 2లో)

ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ఫ్యాఫ్టో ఆధ్వర్యంలో విజయవాడ, మచిలీపట్నంల్లో నిరసనలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ (విజయవాడ), కలెక్టరేట్ (కృష్ణా)

ఉపాధ్యాయ, పెన్షనర్ల అపరిష్కృత సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫ్యాఫ్టో రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు విజయవాడ, మచిలీపట్నంలో బుధవారం నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు. విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగిన కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 11వ వేతన సవరణ సంఘం కాలం ముగిసి నేటికీ 21 నెలలు గడిచినా 12వ పిఆర్‌సి గురించి కమిషనర్‌ను నియమించలేదన్నారు. తక్షణమే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. రూ.25 వేల కోట్లు ఆర్థిక బకాయిల చెల్లింపుపై రోడ్ మ్యాప్ ప్రకటించాలన్నారు. ఎపిటిఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగుల ఆగ్రహానికి గురి కాక ముందే ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలన్నారు. ఫ్యాప్టో ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ అలవాల సుందరయ్య మాట్లాడుతూ 2022 నుండి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలు, ఉద్యోగుల గ్రాట్యూటీ చెల్లింపుల కోసం నిధులు విడుదల చేయాలని కోరారు.



విజయవాడలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు, పెన్షనర్లు



బందరులో ఉపాధ్యాయులు, పెన్షనర్ల నిరసన

జనరల్ సెక్రటరీ డాక్టర్ ఇంటి రాజు మాట్లాడుతూ 2004కు ముందు నియామకాలు పొందిన వారికి ఇతర రాష్ట్రాల మాదిరిగా పాత పెన్షన్ స్కీము అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నెంబర్ 57ని ఎపి ప్రభుత్వం కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు టి.నాగరాజు మాట్లాడుతూ కోవిడ్ కాలం నుండి చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి మనోహర్ కుమార్, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు జోజప్ప, ఎన్టీఆర్ జిల్లా ఫ్యాప్టో కో చైర్మన్లు డి.రామారావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ సయ్యద్ ఖాసిం, వి.బిక్షమయ్య, సదారతుల్లా, డి.రవీంద్రప్రసాద్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, నాయకులు మచ్చా శ్రీనివాస్, ఎం.కృష్ణయ్య, పి.లీల, పి.నాగేశ్వరరావు, బి.విశ్వ భారతి, సయ్యద్ హఫీజ్ పాల్గొన్నారు.

మచిలీపట్నం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఫ్యాప్టో కృష్ణాజిల్లా చైర్మన్ ఎ.సుబ్రహ్మణ్యం, సెక్రటరీ జనరల్ కె.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కాలయాపన చేయడంతోనే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆగ్రహానికి (మిగతా 2లో)

పింఛన్ల సొమ్ముతో పరారైన తరుణ్ అరెస్టు

- సెల్‌ఫోన్లో క్యాసినో ఆడినట్లు గుర్తింపు

ప్రజాశక్తి-కంచికచర్ల : సామాజిక పింఛన్ల సొమ్ముతో పరారైన సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ తోట తరుణ్‌కుమార్‌ను మంగళవారం రాత్రి కంచికచర్ల పోలీసులు అరెస్టు చేశారు. గంపలగూడెం మండలం పెనుగొలనులోని స్వగృహానికి వచ్చినట్లు తెలుసుకున్న కంచికచర్ల ఎస్ఐ బి.రాజు తన సిబ్బందితో అక్కడికి వెళ్లి అరెస్టు చేశారు. పింఛనుదారుల సొమ్ముతో తన సెల్‌ఫోన్లో డఫా బెట్ యాప్ ద్వారా క్యాసినో ఆడినట్లు పోలీసులు గుర్తించారు. తరుణ్ వద్ద కేవలం రూ.28 వేలు లభించినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయనపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. శనివారం సాయంత్రం రూ.7.48 లక్షల పింఛన్ల సొమ్ముతో పెనుగొలను వెళ్లిన ఆయన తిరిగి కంచికచర్ల రాలేదు. దీంతో ఎంపిడిఓ లక్ష్మీకుమారి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. సరదాలకు, వ్యసనాలకు, జూదాలకు పింఛనుదారుల సొమ్ము వాడుకోవడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేశారు.



మాధవరావుకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, మాదల వెంకటేశ్వరరావు తదితరులు

ఆదర్శనీయుడు మాధవరావు

సంస్మరణ సభలో వక్తలు

వార్త 5లో

ఇష్టారీతిన మద్యం షాపుల నిర్వహణ

ఉదయం తొమ్మిది నుంచే అమ్మకాలు ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి: మద్యం షాపులు సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా నిర్వాహకులు వ్యవహరిస్తుంటే ఎక్సైజ్ శాఖ సిబ్బంది చోద్యం చూస్తున్నారని స్థానికు ఆరోపిస్తున్నారు. మద్యం షాపులు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించటంపై పలువురు . విమర్శిస్తున్నారు ప్రతిరోజు ఉదయం 10 గంటలకు మద్యం దుకాణాలు తెరచుకోవాల్సి ఉండగా 9 గంటలకే ద్వారాలు తెరుచుకుంటున్నాయి. అప్పటినుండే మందుబాబులు క్యూ కడుతున్నారు,రోడ్లపై హల్చల్ చేస్తున్నారు. కానీ మద్యం షాపులకు సమయపాలన లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ సంఘటనలు చల్లపల్లి మండలంలో గల మద్యం షాపుల నిర్వాహకులు చేస్తున్న పరిస్థితి. నా వెనుక రాజకీయ పలుకుబడి ప్రముఖులు అండదండలు ఉన్నాయనే ధీమాతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సాయంత్రం అయితే జాతీయ రహదారిపై తిరునాళ్ళ లాగా మందుబాబుల హడావుడి ఎక్కువవుతుంది. కనీసం బైకు తప్పించడానికి కూడా అవకాశం లేని పరిస్థితి అక్కడ నెలకొంటుంది. రోడ్డు ప్రక్కన బైకు పెడితేనో, త్రిబుల్ రైడ్ చేస్తేనో హడావుడి చేసి క్షణాల మీద పోలీస్ స్టేషన్ కు తరలించే పోలీసులు కూడా పట్టించుకోని పరిస్థితి. మద్యం దుకాణాల వద్ద ట్రాఫిక్ ఉందని ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారని కేసులు పెట్టేవారు కూడా లేరు. బందరు రోడ్డు, చల్లపల్లి బైపాస్ రోడ్డు, మంగళాపురం రోడ్డు రాకపోకలకు ఆటంకం కలుగుతున్న పట్టించుకునే వారు కరువయ్యారు.

మొదటిపేజీ తరువాయి

ధాన్యం సేకరణ నిలిపివేత

తర్వాత ఆర్ఎస్‌కెలో సంప్రదించారు. ధాన్యం సేకరణ గడువు ముగిసిందని చెప్పడంతో ఘంటసాలలోని రైస్ మిల్లరుకు బస్తా రూ.1600కు విక్రయించారు. 90 బస్తాలకు రూ.12,600 నష్టపోయారు. ఈ గ్రామ ఆర్ఎస్‌కె పరిధిలో మరో 220 ఎకరాల కుప్పలు నూర్చాలి ఉంది. ఈ రైతులంతా కనీస మద్దతు ధర అందక నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఈ ఒక్క గ్రామంలోనే కాదు.. అనేక ప్రాంతాల్లో ఈ సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతన్నారు. నవంబర్ 15వ తేదీ నుంచి జిల్లాలో ధాన్యం సేకరణ ప్రారంభమైంది. మార్చి నెలాఖరు వరకు 75,090 మంది రైతుల నుంచి 6 లక్షల 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. మరో 2 లక్షల టన్నులకుపైగా ధాన్యం కుప్పల్లోనే ఉంది. సేకరణ నిలిపివేయడం వీరందరికి సమస్యగా మారింది. ఈ క్రాప్ చేసిన వ్యవసాయ భూముల్లో పండిన ధాన్యం పూర్తిస్థాయిలో సేకరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

దాళ్వా ధాన్యం సేకరణపై స్పష్టత ఏది?

కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు, పామర్రు, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో 7,514.31 ఎకరాల్లో దాళ్వా వరి సాగు చేశారు. 43 వేల మెట్రిక్ టన్నులు దిగుబడులు వస్తాయని అంచనా. వచ్చే సీజన్‌లో విత్తన అవసరాలకు పోను 33 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం రైతులు విక్రయించాలి. మరికొద్ది రోజుల్లో దాళ్వా నూర్పిళ్లు మొదలవుతాయి. అయితే ఈ ధాన్యం సేకరణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో దాళ్వాలో వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

గురైందన్నారు. రాష్ట్ర నాయకులు కె.ఎ.ఉమామహేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ బి.కనకారావు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో ఖాళీలు లేవనే పేరుతో సంవత్సరాల తరబడి కారుణ్య నియామకాలు చేపట్టడం లేదన్నారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలనే డిమాండ్ లక్షలాది ఉద్యోగుల గొంతుకగా ఉన్నా కనీసం చర్చ కూడా లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి డిఎ మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యోగులకు డిఎ ప్రకటించాల్సి ఉన్నప్పటికీ మంజూరు చేయకపోవడంతో మూడు డిఎలు పెండింగ్లో ఉన్నాయని, వాటిని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్యులు ఎం.రాజేష్, ఎంవిఎస్ఎన్ ప్రసాద్, జిల్లా నాయకులు ఎం.డి.షౌకత్ హుస్సేన్, సాంబశివరావు, ఇ.వి.రామారావు, బి.లంకేష్, సూరిబాబు, అస్లామ్, పలువురు ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

జంతు సంరక్షణ సామాజిక బాధ్యత : కలెక్టర్



ప్రజాశక్తి-విజయవాడ

జంతు సంరక్షణ అనేది సామాజిక బాధ్యత అని, జంతువులపై క్రూరత్వ నివారణ చట్టం అమలుకు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన బుధవారం జంతువులపై క్రూరత్వ నివారణ జిల్లా సొసైటీ (డీఎస్‌పీసీఏ) సర్వసభ్య సమావేశం వర్చువల్‌గా జరిగింది. తొలుత జిల్లా సొసైటీలో ప్రగతిశీల రైతులు ఎ.శ్రీపద్మ, వి.రవికుమార్‌ల సభ్యత్వానికి సమావేశం ఆమోదం తెలిపింది. అనంతరం జిల్లా పరిధిలో జంతు సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు, వేసవి కార్యాచరణ, వీధి కుక్కలు-జనన నియంత్రణ కార్యక్రమం అమలు, యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్ తదితరాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జంతువులపై క్రూరత్వ నివారణ జిల్లా సొసైటీ సభ్యుల సమిష్టి కృషితో జంతువులపై క్రూరత్వ నివారణ చట్టం పటిష్ట అమలుకు కషిచేయడం జరుగుతోందన్నారు. విజయవాడ నుంచి 10-15 కి.మీ.లోపు జిల్లా ఎస్‌పీసీఏ యానిమల్ షెల్టర్ (గోశాల) ఏర్పాటుకు ఎకరా స్థలాన్ని గుర్తించాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వేసవి నేపథ్యంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సహాయంతో అన్ని ఆవాసాల్లోనూ నీటి తొట్టెల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్నవాటికి ఏవైనా మరమ్మతులు అవసరమైతే యుద్ధప్రాతిపదికన చేసి, వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీరాజ్, డ్వామా, పశు సంవర్ధక శాఖల అధికారులను ఆదేశించారు. భారత జంతు సంక్షేమ బోర్డు (ఏడబ్ల్యూబీఐ) మార్గదర్శకాలు, యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్-2023 ప్రకారం జిల్లాలో వీధి కుక్కల సంతాన నియంత్రణ కార్యక్రమాన్ని (యానిమల్ బర్త్ కంట్రోల్-ఏబీసీ) అమలుచేస్తున్నట్లు తెలిపారు. నెలకు సగటున 1,100 ఏబీసీ శస్త్రచికిత్సలు జరుగుతున్నాయన్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 211 కెన్నెళ్లు అందుబాటులో ఉన్నాయని, మరో 100 కెన్నెళ్ల నిర్మాణం పూర్తయి వినియోగానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జంతు సంరక్షణపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలను కొనసాగించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డా. ఎం.హనుమంతరావు, జెడ్‌పీ సీఈవో కె.కన్నమ నాయుడు, డీపీవో పి.లావణ్య కుమారి, డీఈవో యూవీ సుబ్బారావు, నాన్ అఫీషియల్ వైస్ ప్రెసిడెంట్ పాకూరి బాలకష్ణ, సొసైటీ సభ్యులు గోవింద సాబూ, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విఎంసి సిసిపిగా సంజయ్‌రత్నకుమార్

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ నూతన చీఫ్ సిటీ ప్లానర్ (సిసిపి)గా కె.సంజయ్‌రత్నకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో సిసిపిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పటి వరకు విఎంసిలో సిసిపిగా పని చేసిన జివిఎస్‌వి ప్రసాద్‌ను హెడ్డాఫీసు (డిటిసిపి)కు బదిలీ అయ్యారు. ప్రసాద్ స్థానంలో సంజయ్‌రత్నకుమార్‌ను ప్రభుత్వం బదిలీ చేయగా బుధవారం తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర కమిషనర్ ధ్యానచంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సిసిపికి వారు శుభాకాంక్షలు తెలిపారు. సంబంధిత అధికారులు, ఉద్యోగులను సమన్వయం చేస్తూ టౌన్‌ప్లానింగ్ విభాగంను సమర్థవంతంగా నిర్వహించాలని మేయర్, కమిషనర్ సూచించారు.



బ్రాండ్ ఇమేజ్ టైటిల్ పోటీల్లో పాల్గొనండి

- పర్యాటకులను ఆకర్షించేలా టైటిల్, ట్యాగ్‌లైన్లను సూచించాలి
- ఎన్‌టిఆర్ కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ: రాష్ట్ర నవ్య రాజధాని అమరావతికి గేట్‌వే నగరమైన విజయవాడకు దేశ, విదేశాల పర్యాటకులను ఆకర్షించి, సరైన గుర్తింపు తెచ్చేందుకు బ్రాండ్ ఇమేజ్ టైటిల్ పోటీలను నిర్వహిస్తున్నామని.. ఔత్సాహికులు విజయవాడ నగరంపై ఉన్న ఆసక్తిని, ఆలోచనలను ప్రతిబింబించేలా టైటిల్, ట్యాగ్‌లైన్‌లను సూచించాలని, పోటీలో విజేతలకు ప్రశంసాపత్రం, బహుమతులు అందజేస్తామని ఔత్సాహికులకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. అమరావతి నగరాన్ని దేశవిదేశాల పర్యాటకులు సందర్శిస్తున్న తరుణంలో విజయవాడకు ఒక బ్రాండ్ ఇమేజ్ సంతరించుకునేలా బ్రాండ్ టైటిల్‌ను పెట్టాలన్న ఆలోచన రావడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బ్రాండ్ టైటిల్, ట్యాగ్‌లైన్‌ను Brandvjacomp.collectorntrdist@gmail.com మెయిల్ ఐడీకి పంపాలని, దీంతో పాటు పంపిన వారి పేరు, చిరునామా, మొబైల్ నంబరును తెలియజేయాలన్నారు.

హోటళ్లలో అగ్నిమాపక అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి బుధవారం వైబ్రాంట్ హోటల్, ఎంజి రోడ్డు, మినర్వా గ్రాండ్, సర్వీస్ రోడ్, ఏలూరు రోడ్లలోని హోటళ్లను ఆకస్మిక తనిఖీ చేశారు. అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానము, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ తనిఖీ లో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా పాల్గొన్నారు.





విస్తృతంగా యాంటీ లార్వా ఆపరేషన్లు

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు బుధవారం అజిత్ సింగ్‌నగర్, శ్రీనగర్ కాలనీ, సత్యనారాయణపురం, విద్యాధరపురం ప్రాంతాల్లో మలేరియా సిబ్బందితో యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించారు. అజిత్ సింగ్‌నగర్, పిఅండ్‌టి కాలనీ పరిసర ప్రాంతాల్లో విజయవాడ నగర పాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ మలేరియా సిబ్బందితో సైడ్ డ్రైన్‌లలో నీటి నిలువల వల్ల కాలువలో దోమలు ఉత్పత్తి అయ్యే అవకాశాలు ఉన్నందున వాటిలో డిసిల్టింగ్ ప్రక్రియను పూర్తి చేసి, సైడ్ డ్రైన్‌లో నీటి ప్రవాహంలో ఎటువంటి ఆటంకం లేకుండా పరిశుభ్రపరిచి, యాంటీ లార్వా ఆపరేషన్ లో భాగంగా దోమలు ఉత్పత్తి చెందకుండా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేయించారు. కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను పరిశుభ్రపరచటమే కాకుండా ఎం.ఎల్ ఆయిల్ స్ప్రే చేసి, కాలువపైన దోమలు ఉత్పత్తి కాకుండా చర్యలు తీసుకున్నారు. మరోవైపు మలేరియా సిబ్బంది బోట్ల సహాయంతో గొర్రెపుడెక్కలను తొలగించి, కాల్వ ప్రవాహంలో ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నారు.

నేడు, రేపు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - నందివాడ : మండలంలో కార్పొరేషన్ లోన్‌లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏప్రిల్ మూడవ తేదీన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని మండల ఎంపీడీవో పి. మల్లేశ్వరి అన్నారు. కార్పొరేషన్ లోన్ లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏప్రిల్ మూడవ తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషాలకు మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో హాజరుకావాలని చెప్పారు. దరఖాస్తుదారులు తమ వెంట దరఖాస్తు చేసుకున్న అర్జీ, ఆధార్, రేషన్, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్ పుస్తకం, ఒరిజినల్ నకళ్ళు కాపీలు కూడా తమ వెంట తీసుకు రావాలని కోరారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడు మండల పరిధిలో కార్పొరేషన్ రుణాలకుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 4వ తేదీన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కంకిపాడు ఎంపిడిఒ కార్యాలయ అధికారులు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం10 గంటల 30 నిమిషాలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో హాజరుకావాలని అన్నారు. .
ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ మండల పరిధిలోని వివిధ కార్పొరేషన్ లోన్ల కొరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈనెల 3వ తేదీన ఇంటర్వ్యూలు జరగనున్నాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బివై విష్ణు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం గుడివాడ మండల పరిషత్ కార్యాలయంలో సమావేశపు మందిరంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు లబ్దిదారులందరూ తప్పక హాజరు కావాలని ఎంపీడీవో కోరారు. ఈ సందర్భంగా 3వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు బిల్లపాడు, బొమ్మలూరు, కలవపూడి అగ్రహారం, మల్లాయపాలెం, వలివర్తిపాడు గ్రామాలకు, అలాగే మిగిలిన గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహి స్తామన్నారు.



ప్లేట్లు అందిస్తున్న దృశ్యం

భోజనం ప్లేట్లు బహూకరణ

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్: ఎన్నారై కారుమూరి మాధురీలత గిలకలదిండి ఎస్ఎస్ఎన్జి పాఠశాలకు భోజనం ప్లేట్లు బుధవారం బహూకరించారు. 110 మంది విద్యార్థులకు 8000 రూపాయలు ఖర్చుపెట్టి తన చిన్ననాటి మిత్రుడు స్కూల్ అసిస్టెంట్ కోలా వెంకటేశ్వరరావు మాస్టర్ ద్వారా అందజేశారు. మాధురీలత తన తండ్రి, విశ్రాంత ప్రభుత్వ అధికారి కారుమూరి నాగభూషణరావు జ్ఞాపకార్థం విద్యార్థులకు ప్లేట్లు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గ్రేస్ పుష్పరత్నపభ పాల్గొన్నారు.

బందరు అభివృద్ధిని పేర్ని నాని, కిట్టు అడ్డుకుంటున్నారు : టిడిపి


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మాజీ మంత్రి పేర్ని నాని, అతని కుమారుడు పేర్ని కిట్టు మచిలీపట్నం అభివృద్ధిని అడ్డుకుంటున్నారని టీడీపీ నాయకులు విమర్శించారు. స్థానిక కాలేఖాన్ పేట శివారు శివగంగ డ్రైన్ దగ్గర ఆక్రమణల తొలగింపును పేర్ని కిట్టు అడ్డుకోవడంపై టీడీపీ నాయకులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షులు ఇలియాస్ పాషా, ప్రధాన కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు , 6వ డివిజన్ టీడీపీ ఇన్ ఛార్జ్ దిలీప్ కుమార్ మాట్లాడాతూ పేర్ని నాని రాజకీయ నాటకాలను నమ్మే స్థితిలో బందరు ప్రజలు లేరన్నారు. ఆక్రమణల తొలగింపును అడ్డుకోడవం గర్హనీయమన్నారు. నగరంలో ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు డ్రైన్లపై ఉన్న ఆక్రమణలన్నింటినీ అధికారులు తొలగిస్తున్నారన్నారు. ఆక్రమణల తొలగింపును నగర ప్రజలంతా హర్షిస్తే పేర్ని నాని, అతని కుమారుడు కిట్టు మాత్రం రాజకీయం చేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. కాలేఖాన్ పేట మురుగు నీటి కాలువ వద్ద ఆక్రమణల తొలగింపును అడ్డుకున్న తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. బాధితులకు ప్రత్యామ్నాయంగా జీ ప్లస్ 3 ఇళ్లు ఇస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. మచిలీపట్నం అభివద్ధికి ప్రధాన అడ్డంకి కూడా పేర్ని నానినే అని విమర్శించారు. ఆ నాడు చిలకలపూడి మూడు గుళ్ల వెనుక 17 ఇళ్లను నిర్ధాక్షణ్యంగా కూల్చిన విషయం పేర్ని నాని మరచిపోయాడా..? అని ప్రశ్నిం చారు. పేర్ని నాని, పేర్ని కిట్టు రాజకీయ నాటకాలను ప్రజ లంతా గమనిస్తూనే ఉన్నారని గుర్తు పెట్టుకోవాలన్నారు.

ఆప్కాస్‌ను రద్దు చేయొద్దని నిరసన



ప్రజాశక్తి-కంకిపాడు : ఆప్కాస్ రద్దుచేయవద్దని, రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, అలాగే మున్సిపాలిటీలో ఉన్న పెండింగ్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిటియు ఆధ్వర్యంలో తాడిగడప మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు బుధవారం ర్యాలీ నిర్వహించి పోరంకి సెంటర్లో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా కష్ణాజిల్లా సిఐటియు నాయకులు ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు విధానాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని అన్నారు. పెనమలూరు మండలం సిఐటియునాయకులు ఎస్కే మస్తాన్ వలి మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న. హెల్త్ అలవెన్స్, 2023 సమ్మె కాలంలో జీతం డబ్బులు కార్మికులకి వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు వై సరళ,మధిర ఏడుకొండలు, కోశాధికారి చొప్పర రత్న కరుణ. పెనమలూరు మండలం సిఐటియు నాయకులు నరసయ్య, మున్సిపల్ సిఐటియు నాయకులు బిక్షాలు, వెంకటరెడ్డి, సాంబయ్య, బుజ్జులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న బోడే ప్రసాదు

ప్రజాశక్తి-కంకిపాడు : మండల కేంద్రమైన కంకిపాడు అభివద్ధిపై ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రత్యేకంగా దష్టి సారించారు. పెనమలూరు నియోజకవర్గంలోనే కీలకమైన కంకిపాడును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తాను కట్టుబడి ఉన్నట్లు బోడే ప్రకటించారు.బుధవారం కంకిపాడులో 12 లక్షల వ్యయంతో సెంటర్‌లోని గాంధీ పార్క్ పూర్తిస్థాయిలో నిర్మాణం,15 లక్షల రూపాయల వ్యయంతో అంబేద్కర్ నగర్ కు వెళ్ళే ప్రధాన రహదారి విస్తరణ తో పాటు సీసీ రోడ్డుగా అభివద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెర్సు రాజ్యలక్ష్మి, సర్పంచ్ బాకీ రమణ, ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, మాజీ యార్డు ఛైర్మన్ సుదిమళ్ళ రవీంద్ర, ఎంపీడీవో అనూష,మాజీ సర్పంచ్ తత్తర్లమూడి వజ్ర కుమారి పాల్గొన్నారు.

శ్రీకాకుళేశ్వరుని దర్శించుకున్న ఎఎంసి ఛైర్మన్


ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని శ్రీకాకుళేశ్వర స్వామి ఆలయంలో ఆంధ్ర మహావిష్ణు స్వామిని ఘంటసాల మార్కెట్ యార్డ్ ఛైర్మన్ తోట కనకదుర్గ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనాలను అందించారు. అనంతరం ఘంటసాల మార్కెట్ యార్డ్ ఛైర్మన్ తోట కనకదుర్గను కూటమి శ్రేణులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత నాయకులు, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), మాజీ ఎంపీటీసీ సభ్యులు సీతారామరాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు దాసం రామకష్ణ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొడాలి నాని కోసం ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - గుడివాడ : మాజీ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని)కి ఆపరేషన్ సక్రమంగా జరిగి పూర్తి ఆరోగ్యంతో తిరిగి రావాలని వైసిపి నేతలు వివిధ దేవాలయాలు, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. బుధవారం ముంబైలోని ఓ హాస్పటల్లో బైపాస్ సర్జరీ చేయించుకుంటున్న మాజీ మంత్రి కొడాలి నాని శస్త్ర చికిత్స విజయవంతంగా జరగాలని కాంక్షిస్తూ, వైసిపి నాయకులు పట్టణంలోని దేవాలయాల్లో పూజలు, చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, అధికార ప్రతినిధి ఎంవి నారాయణరెడ్డి, ఎంపిపి పెయ్యల ఆదాం తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ ఆపరేషన్‌లో జూదరుల అరెస్ట్


సెర్చ్ ఆపరేషన్లో డ్రోన్ ద్వారా కనుగొన్న దృశ్యం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల పోలీస్ స్టేషన్ పరిధిలోని పాప వినాశనం కరకట్ట వద్ద పేకాట ఆడుతున్నారని అవనిగడ్డ డిఎస్పి విద్యశ్రీకి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్పెషల్ టీం డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేశారు. ఘంటసాల ఎస్ఐ ప్రతాపరెడ్డి వారి సిబ్బంది కరకట్ట పక్కన పేకాట ఆడుతూ ఉన్న వారిని గుర్తించి, వారిపై మెరుపు దాడి చేసి, 8 మందిని అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుండి 740 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఘంటసాల పోలీస్ స్టేషన్‌లో వారిపై కేసు నమోదు చేశారు.


చెక్కు అందజేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

ప్రమాద బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-గన్నవరం : ప్రసాదంపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఫరూక్ కొంత కాలం క్రితం తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం సమీపంలోని నేలకొండపల్లి గ్రామం వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మతి చెందగా ఆయనకు తెలుగుదేశం పార్టీ ప్రమాద బీమా నుండి రూ 5 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ప్రమాద బీమా నుండి మంజూరైన రూ 5 లక్షల చెక్కును ఫరూక్ తల్లి ఫాతిమా, సోదరుడు నాగవల్లి చేతులకు బుధవారం యార్లగడ్డ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి గూడవల్లి నరసింహారావు, జిల్లా టిడిపి మైనార్టీ సెల్ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి చాన్ బాషా పాల్గొన్నారు.

శ్రీలంకమ్మ హుండీ ఆదాయం రూ.4.94 లక్షలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో ఉన్న శ్రీలంకమ్మ అమ్మవారి ఆలయంలోని హుండీలను బుధవారం లెక్కించారు. రూ నాలుగు లక్షల 94 వేల 306 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. మచిలీపట్నం దేవాలయాల పర్యవేక్షణ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హుండీలు లెక్కించగా ఈ ఆదాయం వచ్చిందని తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో అమ్మవారి వార్షిక జాతరను పురస్కరించుకొని కొబ్బరి చిప్పలు సేకరించుకొనుటకు బహిరంగ వేలం పాట నిర్వహించగా పాటదారులు ఎవరు ఆసక్తి చూపలేదు. లడ్డు ప్రసాదం అమ్ముకునేందుకు బహిరంగ వేలం పాట నిర్వహించగా ఇరువురు వ్యక్తులు పోటీ పడగా హెచ్చు పాట దారునిగా కోడూరు కు చెందిన అర్జ ఉమామహేశ్వరరావు 38వేలకు పాటను పాడుకున్నారు. గత సంవత్సరం ఈ లడ్డు పాటకు 33 వేల రూపాయలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ 5 వేల రూపాయలు ఆదాయం పెరిగింది. ఈ కార్యక్రమంలో అమ్మవారి ఆలయ మాజీ ఛైర్మన్ యాసం శ్రీరాములు, ఆలయ అసాదులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.





బహుమతి ప్రదానం

విజయవాడ : ఇఎండిపి ప్రోగ్రాంకు సంబంధించిన జిల్లాస్థాయి ప్రోగ్రాం బుధవారం బిషప్ అజరయ్య గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి సుమారు పది పాఠశాల నుంచి విద్యార్థులు వారు తయారు చేసినటువంటి ప్రాజెక్టుతో హాజరయ్యారు. ఇందులో మొదటి రెండు స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతి కార్యక్రమం జరిగింది. మిగిలిన వారికి పాఠశాల సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలగా జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేను, బిసిబి సెక్రటరీ ఉమరాలి పాల్గొని విజేతలను ప్రకటించారు.

16 నుంచి కెబిఎన్‌లో వేసవి ఉచిత శిక్షణ


ప్రజాశక్తి - వన్‌టౌన్ : కెబిఎన్ కళాశాల యుజిసి ఉమెన్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి మహిళలు, విద్యార్థుల కోసం ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు చెప్పారు. బుధవారం కళాశాలలో శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అనంతరం శ్రీనివాసు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి కాలాన్ని సద్వినియోగం చేసుకుని, తమ సజనాత్మక నైపుణ్యాలను పెంచుకునేందుకు ఈ తరగతులు తోడ్పడుతాయన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా 19 సంవత్సరాలుగా ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ మహిళలకు కంప్యూటర్ అప్లికేషన్స్, డిటిపి, బ్యూటీషియన్, మగ్గం వర్క్స్, కార్టునింగ్, మెహెంది డిజైన్స్, జుంబా డ్యాన్స్, ఫ్రెంచ్ లాంగ్వేజ్ అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులకు వేదిక్ మ్యాథ్స్, జుంబా డ్యాన్స్, వెస్ట్రన్ డ్యాన్స్, ఫ్రెంచ్ లాంగ్వేజ్, స్పోకెన్ ఇంగ్లీష్, స్పోకెన్ హిందీ, కంప్యూటర్ బేసిక్స్, పేపర్ క్రాఫ్ట్ అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. హిందూ హై స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ ఇప్పటిదాకా సుమారు 2 వేల మంది మహిళలు శిక్షణ పొంది, సొంతంగా వత్తులు నిర్వహించుని, ఆర్థికంగా నిలబడే స్థాయికి ఎదిగారన్నారు. మహిళా సాధికారత లక్ష్యంగా తమ కళాశాల యుజిసి స్టడీ సెంటర్ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ శిక్షణ పూర్తిగా ఉచితమని, వివరాలకు 7416926563, 9030766090 నంబరులో సంప్రదించాలని కోరారు. స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ వి.శ్రీదేవి, సభ్యులు వనమాదేవి, గౌతమీదేవి పాల్గొన్నారు.

కమ్యూనిస్టు నాయకుడు అంజిరెడ్డి మృతి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు శీలం అంజిరెడ్డి (78) బుధవారం మృతి చెందారు. 45 డివిజన్, కబేళా సెంటర్‌లో ఆయన నివాసం వద్ద మృతిచెందారు. వృత్తి రీత్యా మిల్క్ ప్రాజెక్ట్‌లో మార్కెటింగ్ సేల్స్ సూపర్వైజర్‌గా పని చేశారు. కృష్ణా మిల్క్ యూనియన్‌లో ఆంధ్రప్రదేశ్ డైరీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పదవిలో కొనసాగారు. సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అజిరెడ్డి మృతదేహంపై జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్ సంతాపం తెలిపారు.

జర్నలిస్ట్ మహేష్‌కు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన శాసనసభ పత్రిక జర్నలిస్ట్ మందా మహేష్‌ను జర్నలిస్ట్ సంఘాల నాయకులు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మహేష్‌కు నిత్యావసరాలు, పండ్లు, కూరగాయాలు, 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు ఆకుల వెంకటనారాయణ, ది న్యూ ఇండియన్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు, అసోసియేషన్ ఆఫ్ ప్రింట్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ వర్కింగ్ జర్నలిస్ట్ వ్యవస్థాపక అధ్య క్షులు పి.మీరాహుస్సేన్ ఖాన్, సీనియర్ జర్నలిస్టులు వి.రవిశేఖర్, పఠాన్ సైదాఖాన్, శ్రీనివాస రావు, పంగులూరి వెంకట్రావు, అన్నవరపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

5న సిఎం ప్రజా వేదికకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి- నందిగామ, చందర్లపాడు : ఈ నెల 5న బాబూ జగ్జీవన్ రాం జయంతి సందర్భంగా నందిగామ నియోజకవర్గం, చందర్లపాడు మండలం, ముప్పాళ్లలో జరిగే ప్రజా వేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ బుధవారం ముప్పాళ్లలోని వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రాం జయంతి సందర్భంగా జిల్లాలో తొలి ప్రజావేదిక కార్యక్రమం జరగనుందని.. ఇందులో గౌరవ ముఖ్యమంత్రి స్థానిక ప్రజలతో ముచ్చటిస్తారని.. ప్రధానంగా పీ4 విధానంలోని బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో పేదరిక నిర్మూలన ప్రణాళికపై చర్చించడం జరుగుతుందని వివరించారు. వివిధ పథకాలు, సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు, పీ4 విధానం, పీ 4 సర్వే తదితరాలపై ప్రత్యేకంగా స్టాళ్ల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమ ప్రాంగణం వద్ద ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పీ సీఈవో కె.కన్నమనాయుడు, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, డీపీవో పి.లావణ్య కుమారి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శ్రీనివాస శిరోమణి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

బాలస్వామి నిరాధార ఆరోపణలు ఆపకుంటే బుద్ధి చెప్తుతాం : సిపిఎం

ప్రజాశక్తి - విజయవాడ : హాకర్స్‌కు అండగా నిలిచే సిపిఎం నేతలపై లేనిపోని అబాండాలు మోపుతూ...హాకర్స్ జీవనోపాధిని దెబ్బతీస్తున్న టిడిపి ఫ్లోర్‌లీడర్, 23వ డివిజన్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి తన వైఖరి మార్చుకొని వ్యవహరిస్తే మంచిదని, లేనట్లయితే హాకర్స్ తగిన బుద్ధి చెప్పాల్సి వస్తోందని సిపిఎం నేతలు పేర్కొన్నారు. ఆపార్టీ పశ్చిమ, సెంట్రల్, తూర్పు సిటీ కమిటీల కార్యదర్శులు బోయి సత్యబాబు, భూపతి రమణారావు, పి.కృష్ణ బుధవారం స్థానిక శ్రీశ్రీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హాకర్స్, ఉద్యోగ, కార్మికుల జీవనోపాధికి రక్షణగా నిలుస్తూ, వారి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తున్న సిపిఎం చరిత్ర ఏమిటో...అలాగే బీసెంట్ రోడ్డులోని హాకర్స్ వద్ద నుంచే గాక వివిధ రూపాల్లో నిత్యం దందాలు చేస్తూ లక్షలు గడిస్తున్న బాలస్వామి చరిత్ర ఏమిటో డివిజన్‌లోని ప్రజలందరికీ తెలుసునని, లేనిపోని అవాకులు-చవాకులు పేలుస్తూ ఆయన మాట్లాడటం మానుకోవాలని వారు కోరారు. స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అండదండలతో టిడిపి ఫ్లోర్‌లీడర్ బాలస్వామి ముడుపుల కోసం బెదిరింపులకు దిగుతూ... హాకర్స్ జీవనోపాధిని దెబ్బతీస్తున్నాడని మండిపడ్డారు. నాలుగైదు దశాబ్దాల నుంచి ఎంతో అన్యోన్యంగా, కలిసిమెలిసి బీసెంట్ రోడ్డులోని వ్యాపారులు, హాకర్స్ వ్యాపారాలు చేసుకుంటూ, వారి జీవనోపాధికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకునే వారని చెప్పారు. నగర వ్యాప్తంగా 30 వేల మంది హాకర్స్ ఉన్నారని,వారికి కనీసంగా గుర్తింపుకార్డులు, బ్యాంక్ రుణాలు, రక్షణ వంటి చర్యలు నగరపాలక సంస్థ పూర్తిగా విస్మరించిందని అన్నారు. నిరాధార ఆరోపణలు చేస్తే హాకర్స్, ప్రజలు తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు.



మాట్లాడుతున్న సత్యబాబు

విద్యుత్ భారాలను రద్దు చేయాలని పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వత్సవాయి : 'మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు-పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలి' డోర్ పోస్టరును బుధవారం సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. వత్సవాయిలోని సిపిఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, కె.కళ్యాణ్ పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల్నే ఈ ప్రభుత్వం కూడా అనుసరిస్తుందని విమర్శించారు. ప్రజలపై ట్రూ అప్, సర్దుబాటు చార్జీల పేరుతో 15 వేల 485 కోట్లు కూటమి ప్రభుత్వం భారవేసిందని మండిపడ్డారు. ఎలాంటి విచారణ లేకుండా, ప్రజాభిప్రాయం స్వీకరించకుండా భారాలు మోపటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో మరో కొత్త భారం వినియోగదారుల నెత్తిన పడనుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.రాము జిల్లా నాయకులు సిహెచ్.హనుమంతరావు మండల కమిటీ సభ్యులు టి.రమేష్ కె.కొండయ్య, కే.పటేల్, ఎస్.రవి, ఎం.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కిడ్నీ బాధితులకు కృష్ణాజలాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి ఎ. కొండూరు : ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల కిడ్నీ బాధితులకు కృష్ణా జలాలు మందులు ఇచ్చి ఆదుకోవాలని తిరువూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మనుబోలు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఎ.కొండూరు మండలం చీమలపాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎ.కొండూరు పరిసర ప్రాంత కిడ్నీ బాధితుల సమస్యలతో పాటు గంపలగూడెం మండల కిడ్నీ వ్యాధి బాధితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఉదయం మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం జనవాణిలో టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌కు గంపలగూడెం మండల అధ్యక్షుడు చింతలపాటి వెంకటకృష్ణారావు, ఉపాధ్యక్షుడు జరబల రామకృష్ణతో కలిసి వినతి పత్రం అందజేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

అసిస్టెంట్ ఉపాధ్యాయుడిని నియమించాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొండపల్లి (బాలుర)నందు విద్యార్థులకు ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఉర్దూ ప్రథమ భాష బోధించుటకు ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్టును మంజూరు చేయవలసిందిగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు యం. శేషగిరిరావు వారికి కొండపల్లి మైనార్టీ ముస్లిం పెద్దలు, తల్లిదండ్రులు ఉర్దూ భాష ప్రేమికులు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పరిషత్ కొండపల్లి (బాలుర) ఉన్నత పాఠశాల నందు ముస్లిం మైనార్టీ విద్యార్థులు, ఉర్దూ మొదటి భాషకు దూరం అవుతున్నారని అన్నారు.

నారాయణ స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో బుధవారం గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ పూర్తి చేసుకుని ఒకటో తరగతిలోకి అడుగుపెడుతున్న చిన్నారులకు ఎజిఎం హరీష్ గోల్డ్ మెడల్‌తో పాటు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ ప్రోగ్రాంలో జోనల్ కోఆర్డినేటర్ ఖమర్ జహన్, ప్రిన్సిపల్ పవన్ కుమార్, ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపల్ చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నియమాలు పాటించని వారితో ట్రాఫిక్ విధుల నిర్వహణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘించిన 13 మంది వాహనదారులకు రెండు గంటలు ట్రాఫిక్ నిర్వహణకు సహాయంగా ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసులు వినియోగించారు. ఈ సందర్భంగా వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గంపలగూడెం : కనుమూరు గ్రామంలో గల రైతు (ఎస్ ఆర్ కె)సేవా కేంద్రం నందు బుధవారం 2024 సంబంధించిన రబీ పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు విస్తరణ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ కేంద్రాన్ని స్థానిక పిఎసిఎస్ సీఈవో ఎస్ కే ఉస్మాన్ ప్రారంభించగా, అధికార పార్టీ నాయకులు టి అప్పిరెడ్డి, చెరుకు సత్యనారాయణ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పంట పొలాలకు భూసార పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - వీరులపాడు : మండలంలోని నరసరావుపాలెం గ్రామంలో రైతుల అవగాహన కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు రైతులకు ఇచ్చే సూచనలు సలహాలు వ్యవసాయ పనులు చేపట్టాలని పలు విషయాలపై రైతులతో మాట్లాడిన వ్యవసాయ అధికారి షేక్ నీలోఫర్ మాట్లాడుతూ పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి రావాలంటే నేలకు సూక్ష్మ, స్థూల పోషకాలు అవసరం. గతంలో సేంద్రియ ఎరువుల ద్వారా అవి సమపాళ్లలో అందేవన్నారు. భూసార పరీక్షలను పట్టించుకోకుండా చాలాచోట్ల అవసరం లేకపోయినా యూరియా తదితరాలను చల్లేస్తున్నారన్నారు. దానివల్ల నేల సారం కోల్పోయి ఉత్పాదకత పడిపోతోంది. ఇన్ని అనర్థాలకు కారణమవుతున్న రసాయన ఎరువుల వాడకాన్ని నిరుత్సాహపరిచి తీరాలన్నారు. సాగు పద్ధతుల్లో వచ్చిన మార్పులతో గత యాభై ఏళ్లలో వరి, గోధుమల్లో ఐరన్, జింక్ వంటి పోషక విలువలు తరిగిపోయాయన్నారు. ఇబ్బడిముబ్బడిగా రసాయన ఎరువుల వాడకం మూలంగా తలెత్తే ఉపద్రవాలపై సాగుదారులకు అవగాహన కల్పించాలని, భూసార పరీక్షల ఫలితాల ప్రకారమే ఎరువులను వాడేలా చైతన్యం పెంచాలని అన్నారు.

ఆదర్శనీయుడు మాధవరావు

● సంస్మరణ సభలో వక్తలు



మాట్లాడుతున్న మాదాల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : దేశంలోనూ రాష్ట్రంలోనూ ప్రజావ్యతిరేక రాజకీయాలు నడుస్తున్నా యని సిపిఎం జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వరావు పేర్కొన్నారు. బుధవారం మోపిదేవి మండలం మెరకనపల్లిలో జరిగిన స్వర్గీయ యర్రంశెట్టి మాధవరావు వర్ధంతి సభలో మాదాల ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మాధవరావు లాంటివాళ్ళు చివరి శ్వాస విడిచే వరకు ఎర్రజెండాలు పట్టుకుని పేదల శ్రేయసు కోసమే నిరంతరం పరితపించడం నేటి తరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. పార్టీ పిలుపుకు కట్టుబడి పని చేయడం కోసం అవకాశవాద రాజకీయాల కోసం పార్టీలు మారే ఆలోచనలు ఇసుమంతైన చోటు ఇవ్వని మాధవరావు లాంటి వాళ్లను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వామపక్షాలు ఐక్యతగా ఉండి విచ్ఛిన్నకర శక్తులను గద్దె దింపే వరకు విశ్రమించకూడదన్నారు. గ్రామ గ్రామాన శాఖల విస్తరణ క్రియాశీల సభ్యుల పెంపు క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా పనిచేసే విషయంలో సిపిఎం సానుభూతిపరులు, అభిమానులు చురుకైన పాత్ర పోషించాలన్నారు. గతంలో కమ్యూనిస్టులు ప్రజా సమస్యల కోసం పేదల కు భూములు పంచడం కోసం పోరాడే వారనీ నేడు మన రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి పోరాడాల్సి వస్తుందని విచారం వ్యక్తం చేశారు. ఈ సంస్మరణ సభకు మోపిదేవి మండల సిపిఎం కార్యదర్శి సిరివెళ్ల రాజశేఖర్ అధ్యక్షత వహించగా సిపిఎం జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు శీలం నారాయణరావు పంచకర్ల రంగారావు తదితరులు ప్రసంగించారు. చల్లపల్లి మండల సిపిఎం కమిటీ కార్యదర్శి మధు, ఘంటసాల మండల సిపిఎం కమిటీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా, మోపిదేవి మండల సిపిఎం కమిటీ సభ్యులు బెజవాడ నాగేశ్వరావు, పులివర్తి నాగమల్లేశ్వరరావు, కర్ర వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

పలువురి నివాళి : మాధవరావు చిత్రపటానికి నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, సీనియర్ నాయకులు అన్నపరెడ్డి వెంకటస్వామి, జనసేన, టీడీపీ, సీపీఎం నాయకులు నివాళులు అర్పించారు.



మాధవరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మండలి వెంకట్రామ్



'కొమ్మారెడ్డి'లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి-బంటుమిల్లి : యుకెజి పూర్తి చేసుకొని 1వ తరగతి లోకి అడుగు పెడుతున్న విద్యార్థిని, విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, స్కూల్ సెక్రెటరీ,కరెస్పాండెంట్ కె. యస్. వి. జి. శోభ పాల్గొని విద్యార్థిని, విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా యుకెజి నుండి 10 వ తరగతి వరకు వివిధ రకాల పోటీలలో, పరీక్షలలో అత్యంత ప్రతిభ కనబరిచిన 177 మంది విద్యార్థిని, విద్యార్థులకు స్టార్ సర్టిఫికెట్స్, మెమెంటోలు అందించారు. ఈ సందర్భంగా కొమ్మారెడ్డి కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించేలా ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రీ- ప్రైమరీ ఇంచార్జ్ పి. వెంకట లక్ష్మి , పాఠశాల హెచ్ఎం ఎన్. శ్రీనివాసరావు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక ఏఏఎన్ఎంఅండ్ వివిఆర్ ఎస్ ఆర్ పాలిటెక్నిక్ పాలిసెట్-2025 పాలిసెట్ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ బుధవారం తెలిపారు. ఈ శిక్షణ ఏప్రిల్ 3వ తేదీ నుండి ప్రారంభమౌతుందని, కావున పదో తరగతి పరీక్షలు రాసిన గుడ్లవల్లేరు పరిసరప్రాంత విద్యార్థులు ఈ సదవకాశాన్ని ఉపయోగించు కోవాలని తెలిపారు. ముందుగా నమోదు చేసుకున్న విద్యార్థులకు మాత్రమే శిక్షణలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలను 7997508931, 7997132636 నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.**ప్రజాశక్తి-గన్నవరం** : ఈనెల 30వ తారీకు జరగనున్న పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వివి కష్ణమోహన్ బుధవారం ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి 26వ తేదీ వరకు ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం ఒకటిన్నర గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు, శిక్షణ అనంతరం స్టడీ మెటీరియల్ అందజేయటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గన్నవరం పరిసర ప్రాంత విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాడైన ఆర్ఒ ప్లాంట్

● మంచినీటికి ఇబ్బందులు



ప్రజాశక్తి- మచిలీపట్నం అర్బన్ : నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వివిధ పనుల నిమిత్తం మచిలీపట్నం మున్సిపల్ కార్యాలయానికి తరలి వస్తారు. దాదాపుగా 300 మంది సిబ్బంది కార్యాలయంలో పని చేస్తున్నారు. మరోపక్క వేసవి ఎండలు మండుతున్నాయి. అయితే ఆర్ఓ ప్లాంట్ చెడిపోయి ఉండడంతో ఉద్యోగులు, కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఇక్కడ పని చేసే సిబ్బందికి పనులను నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు అందరికీ ఒకటే వాష్ రూమ్ అందుబాటులో ఉంది. పనులు వసూళ్లలో రికార్డులు మోత మోగిస్తున్న అధికార యంత్రాంగం తాగడానికి గుక్కెడు నీళ్ల ప్రకతి అవసరాలు తీర్చుకోవడానికి అవసరమైన టాయిలెట్ల సంఖ్య పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బోడే ప్రసాద్

కంకిపాడులో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు సెంటర్‌లో రాచూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రంను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. తమ ఫౌండేషన్ ద్వారా ప్రజలకు చేయూతను ఇవ్వడంలో ముందుంటామని రాచూరి ఫౌండేషన్ అధినేత, ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి అన్నారు. ఎంపీపీ నెర్సు రాజ్యలక్ష్మీ, సర్పంచ్ బాకీ రమణ పాల్గొన్నారు.

నడకతో మంచి ఆరోగ్యం

ప్రజాశక్తి-గన్నవరం : నడకతో మంచి ఆరోగ్యం లభిస్తుందని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కెవిఆర్ కిషోర్ అన్నారు. జాతీయ నడక దినోత్సవం సందర్భంగా బుధవారం గన్నవరం క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిత్యం నడక తోనే నడవడిక అలవడుతుందని అన్నారు. సీనియర్ వాకర్ చిమట రామారావు మాట్లాడుతూ మితఆహారం శ్రేయస్కరం అన్నారు. మధ్యాహ్నా, రాత్రి భోజనం పిదప పది నిముషాలు నడకకు ఉపక్రమించాలని చెప్పారు.

విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని లక్ష్మీపురం పంచాయతీ శివారు రామనగరంలో ని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో వివిధ పరీక్షలలో విజేతలై బహుమతులు పొందిన విద్యార్థులను బుధవారం స్థానిక పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు స్టేట్ లెవెల్ లో ఐ ఎన్ టి ఎస్ ఓ పరీక్ష లో లాప్టాప్, ట్యాబ్ , స్మార్ట్ వాచెస్, హెడ్ సెట్, స్కై బ్యాగ్స్ మరియు వివిధ బహుమతులు గెలుపొందారని తెలిపారు. మొత్తం 174 మంది విద్యార్థులు వివిధ బహుమతులు గెలుపొందారని వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి : బోడే



వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ బోడే ప్రసాద్

ప్రజాశక్తి-ఉయ్యూరు : రాష్ట్రంలో సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా బుధవారం ఉయ్యూరు నగరపంచాయతీ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజలనుంచి అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. టిడ్కోఇళ్లు నిర్మాణం పూర్తిచేసి ఇవ్వకపోవడంతో అద్దెలు, బ్యాంకునుంచి తీసుకున్న అప్పు కట్టుకోలేక ఇబ్బంది పడుతున్నామని, నూతనంగా పెన్షన్లు రావడంలేదని, పట్టణ పరిధిలో డ్రైన్, ఇత ర సమస్యలు ప్రజలు ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ త్వరలో నిధులు కేటాయించి టిడ్కో గహాల నిర్మాణం పూర్తిచేసి లబ్దిదారులకు అందజేస్తామన్నారు. డ్రైన్లు, తాగు నీరు ఇతర చిన్నచిన్న సమస్యలు కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నగరపంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కౌన్సిలర్లు, మాజీ చైర్మన్ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు..

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



మాట్లాడుతున్న ఎంఎల్ఎ కాగిత కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలంలోని పలు గ్రామాలలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పుట్టి మహా లక్ష్మయ్య ,జేజమ్మ ల కుమారుడు మినరల్ వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసినందుకు అభినందించారు. అలాగే గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సెంటర్లో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ప్రారంభించారు. అనంతరం రామరాజు పాలెంలో, ఐదుగుళ్లపల్లి గ్రామాలలో సచివాలయలను ప్రారంభించారు. మల్లవోలు సెంటర్లో చలివేంద్రం, రామన్నపేట గ్రామాల్లో సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతన స్వామి,జనసేన నాయకులు పంచకర్ల సురేష్, సర్పంచులు లింగం సులోచన రాణి, పరస రాజులు, మొహమ్మద్ రఫీ, గోవాడ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : వీరమాచనేని పద్దయ్య సిద్దార్థ పబ్లిక్ స్కూల్లో బుధవారం ఉదయం ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ శ్రీ మండవ బసవేశ్వర రావు, హానరరీ సెక్రటరీ, ఎపి అకాడమీ అఫ్ సైన్సస్, అమరావతి. డైరెక్టర్, కృష్ణా యూనివర్సిటీ విచ్చేశారు. అనంతరం యుకెజి చిన్నారులకు ప్రశంసా పత్రాలు, సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌కెజి చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ సురెడ్డి విష్ణు, ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, హెడ్ మిస్ట్రెస్ సిహెచ్ జయలక్ష్మి, ఉపాధ్యా యినులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఎ.కొండూరు : ఎ.కొండూరు మండల సమాఖ్య కార్యాలయం వద్ద బుధవారం 2025-2026కు సంబంధించి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై మండల వ్యవసాయ శాఖ, మండల సమాఖ్య ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిటీ మేనేజెడ్ ప్రకతి వ్యవసాయ సిబ్బందికి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై మండల స్థాయిలో అవగాహన సదస్సును రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి షేక్.టిప్పుసుల్తాన్ ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది గ్రామాలలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏపీఎమ్ డి.సాంబశివరావు మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా రైతు కుటుంబాలకు ప్రకతి వ్యవసాయ ఆవశ్యకతను వివో ఏ, వివో బి, సీసీ ల ద్వారా తెలియజేయాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ నాగేశ్వరమ్మ ఏపీ సీ ఎన్ ఎఫ్ 9 సార్వత్రిక సూత్రాలు గురించి, పీ ఎం డి ఎస్ రుతుపవన రాకకు ముందు 30 రకాల విత్తనాలను భూమిలో చల్లి భూమిని సారవంతం చేసే విధానం గురించి వివరించారు. జూనియర్ ప్రాజెక్టు ఎక్సిక్యూటివ్ వాణి ఉర్వి యాప్ గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులు సిహెచ్.శ్రీలత, ఎన్ఎఫ్ఎ రవి కుమార్ మాస్టర్ ట్రైనర్ స్వాతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, కె.ప్రశాంత్, చిదంబరం, సతీష్, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రేపూడి యూనిట్లో ఉన్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో బిసి కార్పొరేషన్ రుణమేళా

ప్రజాశక్తి - విస్సన్నపేట : విసన్నపేట మండల పరిధిలో బీసీ కార్పొరేషన్‌కి సంబంధించి భారీ లోన్ మేళా పత్రాల పరిశీలన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో చిన్నరాట్నాలు మాట్లాడుతూ మండలం మొత్తం ఒకేసారి బీసీ కార్పొరేషన్‌తో పాటు కమ్మ కాపు బ్రాహ్మణ కార్పొరేషన్ సంబంధించి ఒకేసారి అర్జీలను స్వీకరించటం జరిగిందని సుమారు 1200కు పైగా అర్జీలు వచ్చాయని ప్రస్తుతం 600 మందికి పైగా అర్జీదారులు ఇంటర్వ్యూకు వచ్చారని తెలిపారు. గురువారం కూడా ఎక్కువ మొత్తంలో స్థానిక మండల కేంద్రం నుండి అర్జీదారులు వచ్చే అవకాశం ఉందని ఆయన చెప్పారు. అయితే మొత్తం 67 యూనిట్లు మాత్రమే అవకాశం ఉందని ఈ యూనిట్లు మొత్తం మీద ఒక కోటి ఎనభై లక్షలు రూపాయల మంజూరయ్యాయని వీటిని ఎక్కువ మొత్తంలో అర్జీలు రావడం వలన ఎక్కువ మంది లబ్ధిదారులకు లబ్ది చేకూరే విధంగా ఒక్కొక్క లోనుకు లక్ష రూపాయలు చొప్పున 180 మందికి లబ్ధి చేకూరుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఎంఎల్‌ఎలు సౌమ్య, వసంత, శ్రీరాం

ప్రజాశక్తి - వీరులపాడు : ప్రజాసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య తెలిపారు. బుధవారం వీరులపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు వినతులు అందజేశారు. తాగునీటి సమస్యలు, రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా గత వైసిపి పాలనలో పరిష్కారం కానీ ఎన్నో రెవెన్యూ సమస్యలతో ప్రజలు నేటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ షేక్ హుస్సేన్ మండల అభివృద్ధి అధికారి అరుంధతి దేవి మండల విద్యాధికారి కెరిడి పాల్ వివిధ శాఖ అధికారులు, టిడిపి మండల అధ్యక్షులు శ్రీనివాసరావు భారత రెడ్డి చల్లా శ్రీనివాసరావు రైతు నాయకులు వట్టి కొండ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** పట్టణంలో ఎంఎల్ఎ రాజగోపాల్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు వినతులు అందజేశారు. ప్రధానంగా తాగునీటి సమస్య, వీధి లైట్లు, కరెంటు పోల్స్, కుక్కలు, కోతుల బెడద, రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు.ఫిర్యాదులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఎ తాతయ్య స్పష్టం చేశారు. **మైలవరం :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి నిరంతర కృషి చేస్తున్నట్లు ఇకపై ప్రతి బుధవారం మండల కేంద్రాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వివిధ సమస్యలతో ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు.

పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి సహకారం : మంత్రి నారాయణ

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురంలో సుజన మిత్ర కార్యక్రమాన్ని మంత్రి నారాయణ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. సుజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో డివిజన్ కోఆర్డినేటర్లను ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునే వ్యవస్థను రూపొందించారు. సుజనా మిత్రలకు ఇచ్చిన ఎలక్ట్రిక్ బైకులను ఎమ్మెల్యే సుజనా కూటమి నేతలతో కలిసి మంత్రి నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ అభివృద్ధికి తన వంతు సహకారం పూర్తిగా అందిస్తానని హామీ ఇచ్చారు. సుజనా మిత్రలకు సుజనా ఫౌండేషన్ ద్వారా ఎలక్ట్రిక్ స్కూటర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు వంగవీటి రాధాకృష్ణ,



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

సామినేని ఉదయభాను, నాగుల్ మీరా, ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, కూటమి నేతలు బొమ్మసాని సుబ్బారావు, యేదుపాటి రామయ్య పాల్గొన్నారు.

ఉపాధి కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - ఏ.కొండూరు : ఉపాధి కార్మికులకు 12 వారాల నుండి రావల్సిన కూలి డబ్బులు వెంటనే వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పానెం ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎ.కొండూరులో ఉపాధి కార్మికుల సమస్యలను అయన బుధవారం అడిగి తెలుసుకున్నారు. 12 వారాలుగా పనిచేసిన ఒక్క రూపాయి కూడా ఉపాధి డబ్బులు రాలేదని కూలీలు ఆనందరావు దృష్టికి తీసుకెళ్లారు. తీవ్రమైన ఎండలో పని చేసిన 200 రూపాయలకు మించి కూలి పడటం లేదని కనీసం నీడ సౌకర్యం కూడా ప్రభుత్వం కల్పించడం లేదని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలకు కార్పొరేట్ శక్తులపై ఉన్న ప్రేమ ఉపాధి కూలీలపై లేదని దానిలో భాగంగానే ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించే దానిలో జాప్యం జరుగుతుందని ఆనందరావు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీలకు దేశ వ్యాప్తంగా రూ. 2.50 లక్షల కోట్లు కేటాయించ వల్సి ఉండగా కేవలం రూ. 84 వేల కోట్లు మాత్ర మే కేటాయించారని, దీనితో ఉపాధి కూలీలకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. ఏ.కొండూ రు మండలంలో ఉపాధి కూలీల డబ్బులు 12



వివరాలడుగుతున్న పానెం ఆనందరావు

వారాల నుండి రూ 1.50 కోట్లు రావాల్సి ఉందని, వెంటనే ఆ డబ్బులను కూలీలకు చెల్లించాలని అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించి ఒక కుటుంబానికి రెండు వందల రోజులు పని దినాలను కేటాయించి కనీస వేతనం 600 రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆళ్ల అమ్మిరెడ్డి, మేట్లు పాలం గోపి, పటాపంచల పుల్లయ్య, పిన్ని బోయిన భూలక్ష్మి, నేరేటి ఆదయ్య, ఉపాధి కూలీలు పోతురాజు రాంబాబు, బర్రె యాకోబు, రామి శెట్టి శ్రీనివాసరా వు, సాయిని గోపాలరావు తదిత రులు పాల్గొన్నారు.

పెంచిన పాల ధరను తగ్గించాలని నిరసనలు



ఐద్వా ఆధ్వర్యంలో నిరసన...



సిపిఐ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-విజయవాడ : పాల ధరను తగ్గించాలని ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం గుణదలలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ పెంచిన పాల ధరను తగ్గించాలని డిమాండ్ చేశారు. కృష్ణా మిల్క్ యాజమాన్యం ప్రతి లీటర్‌కు రెండు రూపాయలు, పాల ఉత్పత్తులపై మూడు రూపాయలు పెంచడాన్ని ఐద్వా తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు.వీటితోపాటు సంగం డైరీ కూడా పాల ధరలను పెంచిందన్నారు. ఇలా ప్రతి ఒక్క డైరీ స్థాయిలో పాల ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం పెంచడం దారుణమన్నారు. ఇప్పటికయినా పెంచిన పాల ధరలను తగ్గించాలని, లేనట్లయితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు షకీల, విజయ, షబన తదితరులు పాల్గొన్నారు. **వన్‌టౌన్ :** కష్ణా మిల్క్ యూనియన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.200 కోట్లు లాభం వస్తే, విజయ డయిరీ వినియోగదారులకు పాల ధరలను లీటర్ రూ.2 చొప్పున పెంచి,భారాలు వేయటం సబబుకాదన్నారు. విజయవాడ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో పెంచిన పాల ధరలను ఉపసంహరించాలని కోరుతూ పాల ఫ్యాక్టరీ వద్ద జరిగిన నిరసనలో కోటీశ్వరరావు మాట్లాడుతూ గత సంవత్సరం ఏప్రిల్‌లో లీటర్ రూ. 2 పెంచి, ఆగస్టులో రూ.2, మరల ఇప్పుడు ఏప్రిల్ ఒకటి నుండి రూ.2,ఇలా 6 నెలలకోకసారి పాల రేట్లను పెంచి భారాలు వేస్తుందని దుయ్యబట్టారు. ప్రభుత్వాలు పాడి పరిశ్రమలకు సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాల్సి ఉందన్నారు. మంగళవారం పాల ధర పెంచగానే, హోటల్స్ లో టీ ధరలను పెంచేశారని, చైన్ సిస్టం మాదిరిగా పాలతోపాటుగా పాల ఉత్పత్తులపై ఈ భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్ర రావు, కార్యదర్శి వర్గ సభ్యులు బుట్టి రాయప్ప, తాడి పైడ య్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు, కార్యవర్గ సభ్యులు డీవీ రమణబాబు, డివిజన్ కార్యదర్శిలు పాల్గొన్నారు.

విద్య ద్వారానే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి - మైలవరం : విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం.ఉమామహేశ్వరరావు అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం స్థానిక లీలావతి గిరిజన పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వివిధ పాఠ్యాంశాల గురించి విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అందజేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు నరసింహారావు, ఎల్ బాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడత లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

బైకు దొంగలు అరెస్ట్

ప్రజాశక్తి - మైలవరం : జల్సాలకు అలవాటు పడి బైకులను దొంగిలించిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎసిపి వై.ప్రసాద్‌రావు బుధవారం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో బైక్ దొంగల వివరాలను వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం అందిన సమాచారం మేరకు సిఐ చంద్రశేఖర్, ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో మైలవరం మార్కెట్ యార్డ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న పలువురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న ఐదు బైకులను స్వాధీనం చేసుకొని విచారణ చేయగా.బైకులను దొంగిలించినట్లు తేలిందన్నారు. ఐదుగురిలో నలుగురు మైనర్లు కావటం గమనార్హం. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా, ఎంతో విలువైన ఇసుకతో కూడిన మట్టిని పట్టపగలు తవ్వి తరలిస్తుంటే పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ తతంగం మండలంలో గల అన్ని గ్రామాల్లో కొనసాగుతుంది. కొందరు జెసిబి ఓనర్లు మాత్రం మండలంలో గల ఒక అధికారికి చెప్పే మట్టి తవ్వకాలు చేపట్టినట్లు చెప్పడం గమనార్హం.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి - తిరువూరు : ఏపీలో కొద్దిరోజుల పాటు వర్షాలు కురిసే అవకా శం ఉన్నందున రైతులు రబీ వరికోతలు వాయి దా వేసుకోవాలని తిరువూరు మండల వ్యవసాయాధికారిణి పీ పద్మ తెలిపారు. రానున్న వారం పది రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించినందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే వరి కోతలు ప్రారంభించిన రైతులు ధాన్యాన్ని పట్టాలతో కప్పి ఉంచాలని, కోతలు పూర్తయితే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. రైతులు తమకు కావలసిన గోనె సంచులను వారం రోజులు ముందుగా టెక్నికల్ అసిస్టెంట్లకు తెలియజేయాలని, తేమశాతం పరిశీలించిన తర్వాత జీపీఎస్ వాహనాల ద్వారా మాత్రమే రైతుల నుంచి ధాన్యం మిల్లులకు తరలిస్తారని పేర్కొన్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2320, కామన్ రకం రూ.2300 గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. వ్యవసాయాధికారులు సూచనలు పాటించి, ధాన్యాన్ని అకాల వర్షాలకు తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎఒ తెలిపారు.

తిరంగా పార్క్ అభివృద్ధికి సహకరించాలని వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసిన కెసిపి సిమెంట్స్ వారిని 150 అడుగుల జాతీయ జెండా (తిరంగా పార్క్) అభివృద్ధి కొరకు సిఎస్ఆర్ నిధుల ద్వారా కెసిపి సిమెంట్స్ వారి సహాయ సహకారాలు అందించాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ తిరంగా పార్క్ వద్ద ప్రహరీ గోడ, పార్క్ అరేంజ్మెంట్, ఓపెన్ జిమ్, గ్రీనరీ డెవలప్మెంట్, వాకింగ్ ట్రాక్‌లకు కెసిపి సిమెంట్ ద్వారా సిఎస్ఆర్ నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని అడిగామని, దానికి వారి ప్రతినిధులు వీలైనంత త్వరగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, కమిషనర్ రామ్మోహన్, టీడీపీ నాయకులు కళ్యాణపు కోటేశ్వర రావు, కెసిపి ప్రతినిధులు మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతాపరెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - తిరువూరు : ఉద్యోగ విరమణ పొందిన తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాలాల్లో అధ్యాపకులు యరమల ప్రతాప్ రెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, బాల్య స్నేహితులు, పలువురు సత్కరించారు. పాఠశాల ఆవరణ లో బుధవారం ప్రతాపరెడ్డి దంపతులకు ఉద్యోగ విరమణ సన్మాన సభ ప్రధానో పాధ్యాయులు పిఎస్ఎన్. రాజు అధ్యక్షతన జరి గింది. అనంతరం సహచర ఉపాధ్యా యు లు, స్నేహితులు మాట్లాడుతూ విద్యార్థుల ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి మరవలేనిదన్నారు.



శ్రీనివాసరావుకు పరామర్శ

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని రామకోటిపురం గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో రేవతి విద్యాసంస్థల చైర్మన్ యార బార్ల శ్రీనివాస రామాను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పరామర్శించారు. శ్రీనివాసరావు మాతమూర్తి నాగులు ఇటీవల అనారోగ్యం వల్ల మతి చెందడంతో రమేష్ బాబు శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా నాగాయలంక ఎం డి యు రేషన్ వాహనదారుడు బండి వాసు అనారోగ్య కారణంగా ఇటీవల మతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఐదు వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-మచిలీపట్నం: మచిలీపట్నంలోని కాలేఖాన్‌పేటలో విజయగణపతి దేవాలయం ప్రాంగణంలో బుధవారం ఐదు వేల మందికి అన్నదానం చేశారు. ప్రతి నెల మొదటి బుధవారం అన్నదానం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. నెలనెలా అన్నదానానికి హాజరయ్యే భక్తుల సంఖ్య పెరుగుతుందని, అందుకు తగ్గట్టుగానే ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



కార్పొరేషన్ రుణాలకు 444 మంది హాజరు

ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలంలో 585 మందికి కార్పొరేషన్ రునాలకు దరఖాస్తు చేసుకోగా 444 మంది హాజరయ్యారని మండల అభివద్ధి అధికారి డి. వెంకటేశ్వరావు తెలిపారు. బుధవారం మండలంలోని మండల అభివద్ధి కార్యాలయంలో బీసీ, ఎస్సీ కార్పొరేషర్ల రుణాల దరఖాస్తు దారులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. మండలంలోని కృష్ణాపురం, మంటాడ తదితర గ్రామాల నుండి 444 మంది లబ్ధిదారులు హాజరయ్యారని ఎండిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, ఎంపీపీ కాసాని వేద సుప్రజ, పలు గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యనందించేందుకే పాఠశాలల విలీనం : కలెక్టర్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల విలీనం కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డికే బాలాజీ తెలిపారు. మండలంలోని చంద్రాల శివారు సింగలూరు ప్రాథమిక పాఠశాల లో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలోఆ గ్రామ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మౌలిక వసతులు, నాణ్యమైన విద్య అందించడం కొరకు సమీపంలో ఉన్న పాఠశాలలకు కొన్ని పాఠశాలలను విలీనం చేస్తున్నట్లు తెలిపారు. తమ పిల్లల భవిష్యత్తు ఉన్నత స్థాయికి చేరుకుంటుందని ఆయన సూచించారు. ఆ పాఠశాలలో 28 మంది విద్యార్థులు 1 నుండి 5 తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారనీ, ఈ విద్యార్థులను చంద్రాల లోని పాఠశాలలో వచ్చే సంవత్సరం నుండి చదవాల్సిందిగా కలెక్టర్ విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చ చెప్పదలిచారు. అయితే దానికి తల్లులు తమ పిల్లలను మూడు కిలోమీటర్ల దూరంలో ఆ గ్రామానికి పంపించేందుకు సిద్ధంగా లేమని వ్యతిరేకించారు. చంద్రాల గ్రామంలోని పాఠశాలలో 7 8 తరగతులను వేరే స్కూలుకు తరలించకుండా చేయాలని కలెక్టర్‌కు ఆ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రాజేష్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, మండల తాసిల్దార్ బి లోకరాజు, ఎంపీడీవో టీ విజయ సారథి, ఎంఈఓ 2 జి గోపాలరావు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో మాట్లాడుతున్న కలెక్టర్



బంటుమిల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మోడల్ స్కూల్ కావాలంటే..
కనీసం అరవై మంది అవసరం : కలెక్టర్

ప్రజాశక్తి-బంటుమిల్లి : పోటీ ప్రపంచంలో తట్టుకుని నిలబడాలంటే మెరుగైన విద్య చాలా అవసమని, అందుకోసం ప్రభుత్వం ఆలోచించి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలనే మార్పులు చేయాలని భావిస్తోందని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యను బేరీజు వేసేందుకు బుధవారం ఆయన పెడన నియోజకవర్గంలోని కత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్య ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించారు. ఒకే పాఠశాలలో 60 మంది పిల్లలు చదువుతూ ఉంటే ఆ పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా తీర్చిదిద్దుతామన్నారు. కలెక్టర్ వెంట డీఈవో పీవీజే రామారావు, ఎంఈవో బాల త్రిపుర సుందరి, విద్యార్థులను తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

ఉపాధిని దెబ్బతీసే యాప్‌లను రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-విజయవాడ : ఓలా, ఊబర్, రాపిడ్ వంటి మోటర్ విదేశీ యాప్‌ల కారణంగా ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని , వెంటనే ప్రభుత్వాలు స్పందించి ఓలా, ఉబర్, రాపిడ్ వంటి విదేశీ యాప్ లను రద్దు చేయాలని విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు డిమాండ్ చేశారు. బుధవారం బి. ఆర్.టి.ఎస్ రోడ్డులోని నండూరి ప్రసాద్ రావు భవన్ సి.ఐ.టి.యు కార్యాలయంలో ఆటో కార్మికుల విస్తత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో,మోటార్ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఓలా,ఊబర్,రాపిడ్ వంటి విదేశీ యాప్ లస్థానంలో ప్రభుత్వాలే యాప్ లు పెట్టాలని, జీవో నెంబర్ 21,రద్దు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతి ఆటో డ్రైవర్ కు సంవత్సరానికి 15,000 రూపాయలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు ఆటో వర్కర్స్ యూనియన్ నగర నాయకులు పి.తిరుపతయ్య, యం. కొండలరావు, జె.సూర్య నారాయణపాల్గొన్నారు.



పంట వ్యర్థాలను తగలబెట్టొద్దు



ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గన్నవరం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. సునీల్ గ్రామ వ్యవసాయ సహాయకులకు శాఖ పరమైన అంశాలపై సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. రైతులకు పంట వ్యర్థాలను తగలబెట్టకుండా పర్యావరణానికి భూసారానికి హాని కలిగించ కుండా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. పంట వ్యర్థాలను తగల బెట్టడం వలన భూమిలో సేంద్రీయ కార్బనం తగ్గిపోతుందని, నేలలో పోషకాలు, సూక్ష్మ జీవులు నశిస్తాయని అన్నారు. పంట వ్యర్థాలను నెలలో కలియ దున్నాలని అన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎస్ గణేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎవరైనా వేసవి అపరాల సాగుకు ఆసక్తి ఉన్న వారు రాయితీపై విత్తనాల కోసం స్థానిక రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

నాగబాబును కలిసిన శేషుబాబు



ప్రజాశక్తి-అవనిగడ్డ : శాసన మండలి సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన కొణిదెల నాగబాబును మండల జనసేన పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలోనీ నాగబాబు చాంబర్లో కలసి శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్ నుండి అమరావతిలోని అసెంబ్లీ వరకు నాగబాబుతో కలిసి వెళ్లి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాలుపంచుకోవడానికి అవకాశం కల్పించిన నాగబాబుకు వారి బృందానికి శేషుబాబు ధన్యవాదాలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక బేతవోలు పార్క్ సెంటర్లో చలివేంద్రాన్ని జనసేన పార్టీ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ స్థానిక నాయకులు సీతారాం, బుడమ రాజుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చుతుందన్నారు. టిడిపి, జనసేన నాయకులు పోలాసి ఉమా, పొలగాని కష్ణ, విశ్వనాథ్, తిరుపతి, చీకటి సూర్యనారాయణ, మజ్జి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

పంపిణీకి పాఠ్యపుస్తకాలు సిద్ధం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం నోటు పుస్తకాలు, ఇంగ్లీష్ మీడియం పుస్తకాలు కళాశాలకు అందజేసినట్లు చెప్పారు. వాటిని ఉచితంగా విద్యార్థు లకు పంపిణీ చేపడతాయని, ఈనెల ఏడో తారీఖు నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభమవుతాయని వారికి కూడా నోట్ పుస్తకాలు తెలుగు మీడియం ఇంగ్లీష్ మీడియం పుస్తకాలను ఉచితంగా అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు

రూ.22 కోట్ల పన్నులు వసూలు

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : గత మార్చి నెలతో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మొత్తం 22 కోట్ల రూపాయలు పన్నులు వసూలు చేసినట్లు మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారి సమ్మెట వెంకటేష్ తెలిపారు. ప్రైవేట్ ఆస్తులు ద్వారా 13 కోట్లు, నీటి పన్నుల ద్వారా ఐదు కోట్లు, ప్రభుత్వ ఆస్తులు భవనాలు ద్వారా 3.5 కోట్లు వసూలు అయినట్లు తెలిపారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా గోడపత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రజలపై భారం వేసేలా స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ప్రభుత్వం సిద్ధపడిందని, స్మార్ట్ మీటర్ల బిగింపును తిప్పికొట్టాలని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శీలం నారాయణరావు ప్రజలకు పిలుపు నిచ్చారు. స్థానిక గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో బుధవారం పార్టీ నేతలతో కలిసి 'మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని' గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆదానితో చేసుకున్న సెకీ విద్యుత్ ఒప్పందం వల్ల ప్రజలపై మోయలేని భారం పడుతుందని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగల కొట్టండి అని పిలుపునిచ్చిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వచ్చిన తర్వాత మాట మార్చిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి మండల పార్టీ కార్యదర్శి యద్దనపూడి మధు, మండల కమిటీ సభ్యులు మహమ్మద్ ఖరీముల్లా,కె. బాబురావు, మేడేపల్లి వెంకటేశ్వరరావు, ఘంటసాల మండల పార్టీ కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** గత వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన స్మార్ట్ మీటర్లను నేడు కూటమి ప్రభుత్వం అదే పద్ధతిలో అమలు చేస్తుందని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి విమర్శించారు. బుధవారం స్మార్ట్ మీటర్లు వ్యతిరేక కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి స్టిక్కర్స్‌ని వేశారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కూడా స్మార్ట్ మీటర్లు బిగిస్తారని ఈ స్మార్ట్ మీటర్‌ని ఆనాడు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండి అని చెప్పిన లోకేష్ విద్యుత్తులో జరిగిన అవినీతిని కోర్టులో కేసు వేసిన ఆర్థిక మంత్రి ఇప్పుడు జరిగే అన్యాయం మీద మాట్లాడకపోవడం శోచనీయ మన్నారు. ఈ ప్రభుత్వం వచ్చి 15 వేల కోట్లు విద్యుత్ భారాన్ని ప్రజల మీద మోపిందని అన్నారు. ప్రతి కుటుంబం స్మార్ట్ మీటర్‌ని వ్యతిరేకించాలని కోరారు. సిపిఎం నాయకులు పి రజిని, ఆర్ కొండ, బండి శ్రీను, ఎల్ సురేంద్ర, వై కోటేశ్వరరావు, నగీన, భాష, చిన్న , సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - ఉయ్యూరు:** విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ సిపిఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి రాజేష్ అన్నారు. బుధవారం పట్టణంలోనే జనతా బజార్ లో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ట్రూ అప్ విద్యుత్తు ఛార్జీలు వెంటనే తగ్గించాలని కోరారు. సిపిఎం పార్టీ పట్టణ కమిటీ సభ్యులు పడాల లక్ష్మణరావు, బి కీర్తి సూర్యనారాయణ, స్థానికులు కమలమ్మ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.



చల్లపల్లిలో...



ఉయ్యూరులో..

ఇసుక లారీలపై ఓల్టా కేసు



ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట మండల పరిధిలో సాధారణ తనిఖీలలో భాగంగా బుధవారం అనుమతులు, సరైన పత్రాలు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలను గుర్తించి పట్టుకున్నట్లు విస్సన్నపేట ఎస్‌ఐ జి.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా అనుమతులు లేని ఇసుక రీచ్‌ల నుండి సంబంధిత పత్రాలు లేకుండా అక్రమ రవాణా చేస్తున్న లారీలను గుర్తించామన్నారు. లారీలపై ఓల్టా కేసు, డ్రైవరు, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అండగా ఉంటాం.. అద్భుతాలు సృష్టించండి : శాప్ చైర్మన్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని క్రీడాకారులందరికీ శాప్ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడకుండా అద్భుతాలు సృష్టించాలని శాప్ ఛైర్మన్ రవినాయుడు సూచించారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్‌ను పలువురు క్రీడాకారులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత విజయవాడకు చెందిన ఆర్టిస్టిక్ రోలర్ స్కేటర్ పి.చైత్ర దీపిక కలిసి మార్చి 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ జరిగిన తైవాన్ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఓపెన్ కాంపిటేషన్‌లో భాగంగా పెయిర్ స్కేటింగ్‌లో గోల్డ్ మెడల్, ఇన్‌లైన్‌లో బ్రాంజ్ మెడల్, కపుల్ డ్యాన్స్‌లో సిల్వర్ మెడల్ సాధించినట్లు వివరించారు. అనంతరం ఏఎమ్ఎఫ్ అకాడమీకి చెందిన పారా స్పోర్ట్స్ క్రీడాకారులు, కడప జిల్లాకు చెందిన వాలీబాల్ క్రీడాకారిణి సరిత, హై స్కేటర్ వై.చందన, ఆర్టిస్టిక్ రోలర్ స్కేటర్ కైవల్య తదితరులు శాప్ ఛైర్మన్‌ను కలిసి సాధించిన పతకాల గురించి వివరించడం జరిగింది. సందర్భంగా వారిని శాప్ ఛైర్మన్ అభినందిస్తూ క్రీడాపరంగా ప్రభుత్వం నుంచి పూర్తిసహకారం ఉంటుందని, దానికి అనుగుణంగా రాష్ట్ర ఖ్యాతిని పెంచాల్సిన బాధ్యత క్రీడాకారులపైనే ఉందని సూచించారు.

పాలిసెట్‌కు 'వికాస్' ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ రూరల్ మండలం నున్నలోని జడ్పీ హైస్కూల్లో, వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ పరీక్షకు ఈ నెల 3వ తేదీ నుంచి ఉచిత శిక్షణను ప్రారంభించనున్నట్లు కళాశాల సెక్రటరీ నరెడ్ల సత్యనారాయణ రెడ్డి తెలిపారు. విజయవాడ రూరల్‌లోని నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, గన్నవరం మండలంలోని సూరంపల్లి, ముస్తాబాద్ పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన వారు నేరుగా నున్న హైస్కూల్‌లో జరిగే ఉచిత శిక్షణకు హాజరుకావచన్నారు. పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. గతేడాది కూడా కోచింగ్ ఇచ్చామని, ఎంతోమంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని వివరించారు.

6న అండర్ - 9 చెస్ పోటీలు


ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పోరంకిలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో ఈ నెల 6న కృష్ణా జిల్లా అండర్ – 9 బాల, బాలికల చెస్ చాంపియన్ షిప్ పోటీలు జరుగుతాయని టోర్నమెంట్ డైరెక్టర్ రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. మొదటి రెండు స్థానాలు సాధించిన వారికి మే నెలలో జరిగే అండర్ –9 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివిధ ఏజ్ గ్రూప్ విద్యార్థులకు చెస్ పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి ఏజ్ గ్రూప్‌లోనూ మొదటి రెండు స్థానాలు సాధించిన వారికి ప్రత్యేక బహుమతుల ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు శనివారం సాయంత్రం 6 గంటలలోగా తమ పేర్లను ఎపి చెస్ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. వివరాలకు 9700 775 220 లేదా 9247 153 387 ఫోన్ నంబర్ల ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు.

ఎస్ఎస్‌సి టాపర్లు, మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : విజయవాడ రూరల్ మండలం నున్నలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవ సంవత్సరాన్ని పురస్కరించుకుని, 2024లో జరిగిన సెకండరీ స్కూల్ సర్టిఫికేట్ (ఎస్ఎస్‌సి) పబ్లిక్ పరీక్షలలో రాణించిన 10వ తరగతి విద్యార్థులకు నగదు బహుమతులు ప్రదానోత్సవం బుధవారం జరిగింది. పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవుతున్న, 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఆదర్శప్రాయమైన క్రమశిక్షణ కలిగిన విద్యార్థులను కూడా నగదు అవార్డులతో సత్కరించారు. దాతలు అందించిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డిలు)పై వచ్చిన వడ్డీ రూ.70 వేలతో ఈ బహుమతులను అందజేశారు. నున్నలోని పాఠశాల ఆవరణలోని పూర్వ విద్యార్థుల ఆడిటోరియంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్ రెడ్డి అధ్యక్షతన నగదు బహుమతుల ప్రదాన కార్యక్రమం జరిగింది. పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసి) తమ సబ్జెక్టుల్లో 100శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన ఉపాధ్యాయులను, త్వరలో పదవీ విరమణ చేయబోతున్న తెలుగు ఉపాధ్యాయురాలు అరుణను సత్కరించింది. పూర్వ విద్యార్థి, దాత బుర్రముక్కు నాగి రెడ్డి పదో తరగతిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన పి.యుగంధర్, కె.గాయత్రి, ఎస్ మనోజ్ వెంకటేష్‌కు రూ.5వేలు, రూ.3వేలు రూ.2వేలు నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా, దాత నాగి రెడ్డి మాట్లాడుతూ, తాను పాఠశాల విద్యను 1985లో పూర్తి చేశానని తన అనుభవాన్ని ప్రస్తుత విద్యార్థులతో పంచుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు భూపాల్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో ప్రస్తుతం వివిధ బ్యాంకులలో రూ.6 లక్షలకు పైగా దాతలు సమకూర్చిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయని తెలిపారు. ఈ డిపాజిట్ల నుండి వచ్చే వడ్డీని నగదు బహుమతులను అందించడానికి ఉపయోగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దాత జాన్ బాబు, ఎస్ఎంసి ఛైర్మన్ జి.కుమార్, వైస్ ఛైర్‌పర్సన్ వీర వనిత, ఫస్ట్ అసిస్టెంట్ ఎస్ రవి ప్రసాద్, స్టాఫ్ సెక్రటరీ పి.నాగేశ్వరరావు, ఎస్ఎమ్‌సి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్లేషక్ 2కె25 మెగా ఈవెంట్



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : బిజినెస్ డేటా విశ్లేషణ, నిర్వహణ భవిష్యత్తు వ్యాపార వర్గాలకు కీలకం కానుందని ఇన్వెంటిజ్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ ఇంద్రజిత్ అన్నె అన్నారు. పిబి సిద్ధార్థ కళాశాలలోని బిజినెస్ అనలిటిక్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగిన విశ్లేషక్ 2కె25 మెగా ఈవెంట్‌లో ఇంద్రజిత్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంద్రజిత్ మాట్లాడుతూ, బిజినెస్ అనలిటిక్స్‌లో వివిధ రకాలను వివరించారు. ముఖ్యంగా ఈ నిర్వహణలో అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కృత్రిమ మేధస్సుతో బిజినెస్ అనలిటిక్స్ నిర్వహణను అనుసంధానం చేయడం ద్వారా కార్పొరేట్ రంగంలో అనేక వైఫల్యాలను అధిగమించవచ్చని పేర్కొన్నారు. బిజినెస్ అనలిటిక్స్ ద్వారా భవిష్యత్తు వ్యాపారాన్ని, వినియోగదారుని ప్రవర్తన తదితర అంశాలను ముందుగానే గుర్తించి వ్యాపార అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా ఇటువంటి ఈవెంట్స్‌లో పాల్గొనడం ద్వారా వ్యక్తిగత నైపుణ్య విజ్ఞానాన్ని పెంపొందించుకుని భవిష్యత్తులో పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి అవకాశం ఉందని సూచించారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి జంపాలా మాట్లాడుతూ, స్వీయ నేర్పరితనం.. నియంత్రణ.. ప్రేరణ వంటి లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. ఈవెంట్ కన్వీనర్, బిజినెస్ అనలిటిక్స్ విభాగాధిపతి డాక్టర్ బి.జయ ప్రకాష్ మాట్లాడుతూ, విశ్లేషక్ ఈవెంట్‌లోని వివిధ అంశాలను వివరించారు. ఈ సందర్భంగా సాయంత్రం నిర్వహించిన విశ్లేషక్ 2కె25 ఈవెంట్‌లో సాంస్కృతిక, సాంకేతిక అంశాలతో పాటు విద్యార్థులు సాంప్రదాయ ప్రాశ్చాత్య నృత్యాలకు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొని అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, బిజినెస్ అనలిటిక్స్ విభాగ అధ్యాపకులు జి.గురుప్రసాద్, మహ్మద్ నాజియా సుల్తానా, ఎస్.సాయిమోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇఎండిపి సైన్స్ ఎక్స్‌పోలో పట్టణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : విజయవాడ బిషప్ హాజరయ్య బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన జిల్లాస్థాయి ఇ ఎండిపి సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమంలో జగ్గయ్యపేట బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు హేమలత, సల్మా జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో గెలుపొందారు. వీరికి పాఠశాల ఉపాధ్యాయిలు జయవాణి, సుబ్బలక్ష్మి గైడ్ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎ.లక్ష్మి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ టీం జిల్లా జట్లు ఎంపిక

ప్రజాశక్తి - మైలవరం : జిల్లా అండర్ 19 బాల బాలికల టెన్నిస్ బాల్ క్రికెట్ జట్లను స్థానిక లక్కిరెడ్డి అనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో ఎంపిక చేసినట్లు అండర్ 19 టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి శ్రీ కష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగిందన్నారు. ఎంపికైన టీమ్‌లు ఈనెల 5,6 తేదీల్లో పల్నాడు జిల్లాలో జరిగే స్టేట్ అండర్ 19 టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

కుమార్తె అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి - గంపలగూడెం: తన కూతురు తప్పిపోయిందంటూ, గంపలగూడెం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు ఏ ఎస్ ఐ పి.వి. రమేష్ బాబు తెలిపారు. మండలంలోని చింతల నర్వ గ్రామ నివాసి కొంగల విజయ కుమారి (18) ఈ ఏడాది మార్చి 31వ మధ్యాహ్నం నుండి కనిపించడం లేదని తల్లి కొంగల సంధ్య ఫిర్యాదు చేసిందన్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రమేష్ బాబు వివరించారు.

మామిడి సాగుపై ఆసక్తి చూపని రైతులు

- తెగుళ్ల భయంతో బెంబేలు : మామిడి చెట్లను నరికేస్తున్న యజమానులు

- ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్‌కు ప్రాధాన్యత

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఎన్‌టిఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలంలో రైతులు మామిడి సాగుపై ఆసక్తి చూపడంలేదు. ప్రస్తుతం మండలంలో అధికారికంగా సుమారు 9,500 ఎకరాల్లో మామిడి తోటలను సాగుచేస్తున్నారు. అనధికారికంగా ఐదు వేల నుంచి ఆరు వేల ఎకరాల్లో దీని సాగు చేపట్టారు. ఈ ప్రాంతంలో పండే మామిడి కాయలకు అంతర్జాతీయంగా మంచి పేరు, డిమాండ్ ఉంది. అయితే గత కొంతకాలంగా మామిడి సాగుతో రైతులకు లాభం రాకపోగా, కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా తిరిగి రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. రైతులు తమ మామిడి తోటలను వ్యాపారులకు అప్పగిస్తున్నారు. దీంతో వ్యాపారులు అధిక దిగుబడుల కోసం వాడే రసాయనిక మందులు కారణంగా రెండు మూడేళ్లలో భూమి నిస్సారమైపోతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తరువాత కాలంలో దిగుబడి లేక ఆందోళన చెందుతున్నారు. పంట మార్పిడి పద్ధతి లేకపోవడం వల్ల కూడా భూమిలో సారం తగ్గుతోందని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు.



మామిడి చెట్లను నరికివేస్తున్న దృశ్యం

కొత్త రకాల తెగుళ్లు

కొత్త రకాల తెగుళ్ల కారణంగా మామిది దిగుబడి తగ్గుతోంది. కాయలో కూడా నాణ్యత తగ్గుతోంది. ఇటీవల కాలంలో వచ్చిన తామర, దోమపోటు వంటి తెగుళ్లు మామిడిని తీవ్రంగా దెబ్బతీశాయి. కాయలు పైకి బాగా కనిపించినా లోపల మాత్రం పురుగుల ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ తెగుళ్ల నివారణ చర్యలపై రైతులు సరైన అవగాహన లేదు. వీటిపై రైతులకు, వ్యాపారులకు అవగాహన కల్పించడంలో ఉద్యానవన శాఖాధికారులు విఫలమవుతున్నారు.

ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యత

నష్టాలు చవిచూస్తున్న మామిడి రైతులు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగుపై మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే మండలంలో చాలా చోట్ల మామిడి చెట్లను నరికి వాటి స్థానంలో ఆయిల్ పామ్ మొక్కలు పెడుతున్నారు.



మామిడి రైతులను ఆదుకోవాలి

నష్టాలతో నిరాశకు గురైన మామిడి చెట్లను నరికేస్తున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు. పంటకు నష్టం వాటిల్లితే నష్టపరిహారం అందించాలని, మామిడి రైతులకు ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.